క్లుప్తంగా

సన్న బియ్యం పంపిణీ

కడియం: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద స్థానిక హైస్కూల్‌కు సన్నియ్యం అందజేశారని ఎంఈఓ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బియ్యాన్ని హెచ్‌ఎం టి.సత్యనారాయణకు సోమవారం అందజేశారు. స్కూల్స్ పునః ప్రారంభానికి ముందే బియ్యాన్ని అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని అందించారని ఎంఈఓ వివరించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల నిర్మాణంలో భాగంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ సోమవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు. వెంకటేశ్వర నగర్ ఏరియా, గోలి రామారావు హాస్పటల్ ఏరియా, వాకర్స్ పార్క్ రోడ్డు, మహాలక్ష్మి దేవాలయం రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్, జేఎన్ రోడ్, చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్, సూర్య ఫంక్షన్ హాల్, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, శ్రీవేంకటేశ్వరనగర్, హ్యాపీ స్ట్రీట్, వాకర్స్ రోడ్, ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలకు ప్రభావం ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బధిర సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: జిల్లాలో బధిరుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన బధిర సంఘ అధ్యక్షుడు విశ్వనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్వరరావు, సాయికుమార్, జనరల్ సెక్రటరీగా విజయ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

నాద నీరాజనంలో యశశ్రీ



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న యశశ్రీ

ధవళేశ్వరం: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన నాద నీరాజనం కార్యక్రమంలో ధవళేశ్వరం గ్రామానికి చెందిన నాట్య వల్లిక నురుకుర్తి యశశ్రీ కూచిపూడి నృత్యం ప్రదర్శించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో యశశ్రీ ప్రదర్శన ఇచ్చారు. సిద్దేంద్ర యోగి కళాపీఠం నాట్యాచార్యుడు కళారత్న డాక్టర్ చింతా రవిబాలకృష్ణ సారథ్యంలో ప్రదర్శన జరిగింది. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరిగిన నాద నీరాజనంలో ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని నురుకుర్తి యశశ్రీ పేర్కొన్నారు.

పేద విద్యార్థులను చదివిస్తాం..

రాజమహేంద్రవరం రూరల్: పీ-4 ద్వారా నాలుగు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు చదువు చెప్పించే బాధ్యతను తీసుకుంటానని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్- 2047 నియోజకవర్గ కేంద్రంగా నియోజకవర్గ అభివృద్ధి సూచికల నివేదిక తయారు చేయడానికి ఐదుగురు సభ్యులతో కూడిన వ్యవస్థను సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రూరల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి సరళవందనం, మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటిప్రసాద్ పాల్గొన్నారు.

ఇదేం డబ్బా..



వాటర్ క్యాన్

- ప్లాస్టిక్ డబ్బాలతో రోగాలు
- రోజూ శుభ్రం తప్పనిసరి
- వ్యాధులు కొని తెచ్చుకోవద్దంటున్న నిపుణులు

రాజమహేంద్రవరం రూరల్: చూడచక్కగా... రంగు రంగులతో ఆకర్షించే ప్లాస్టిక్ బాటిళ్ల వెనుక ప్రమాదం పొంచి చూస్తోంది. మార్కెట్‌లోకి వెళ్లిన వెంటనే ప్రధానంగా ఆకర్షించేవి ఈ బాటిళ్లే. వీటిని ధర తక్కువని ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తుంటారు. అందుకే ప్రతి ఇంట్లో ఇవే దర్శనమిస్తుంటాయి. ఈ క్రమంలో రాజమహేంద్రవరంతో పాటు పరిసర గ్రామాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం భారీగా పెరిగింది. అయితే వాటి వెనుక ప్రమాదం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. వీటిని సక్రమంగా శుభ్రం చేయకుంటే రోగాల బారిన పడడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్లాస్టిక్ బాటిళ్ల ద్వారా నీరు తాగుతున్నారు. నేడు ఏ అవసరానికైనా ప్లాస్టిక్ బాటిళ్లు తప్పనిసరి అయ్యాయి. తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు.. ఇలా ఏదీ తాగాలన్నా, కొనాలన్నా, ప్రజలు వాటిపైనే ఆధారపడుతున్నారు. అయితే వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నా శుభ్రం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. మినరల్ ప్లాంట్‌లో చల్లని నీరు ఇచ్చే ప్లాస్టిక్ క్యాన్లు శుభ్రపరచకుండానే సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శుభ్రం.. రోజూ అవసరం

నిత్యం వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ శుభ్రం చేయాలి. లేనిపక్షంలో వాటి అడుగు భాగంలో జిడ్డు పదార్థం ఏర్పడుతుంది. ఇందులో బ్యాక్టీరియా చేరి పెద్దఎత్తున వృద్ధి చెందుతుంది. దీనివల్ల గొంతునొప్పి, దగ్గు, జీర్ణకోశ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా నాసిరకం ప్లాస్టిక్‌తో తయారయ్యే బాటిళ్లలో సులభంగా నీరు కలుషితమవుతుంది. ఇదిలా ఉండగా మినరల్ వాటర్ క్యాన్లతో వ్యాధులు వస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వాటర్ క్యాన్లను నిర్వాహకులు పెద్దగా శుభ్రం చేయరు. ఇలాంటి క్యాన్లను వినియోగించడం కన్నా స్టీల్‌బాటిళ్లు, బిందెలు, రాగి పాత్రల్లో నీరు తాగితే ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడొద్దని వారు సూచిస్తున్నారు.

ఇవీ అనర్థాలు

ప్లాస్టిక్ క్యాన్లు, బాటిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా చేరుతుంది. వాటిలో గోనో కొక్కల్స్, న్యూమో కొక్కల్స్ వంటి బ్యాక్టీరియా సులభంగా వృద్ధి చెందుతుంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గొంతు, జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు, జ్వరం రావొచ్చు. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించే అవకాశాలు ఎక్కువ. నాణ్యమైన నీటి బాటిళ్లను కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించేవి కొనుగోలు చేయొద్దు. రోజూ వేడి నీటితో బాటిళ్లను శుభ్రం చేసుకోవాలి. బ్రష్‌తో అడుగుభాగం కడగాలి. పూర్తిగా ఎండేలా చూసుకోవాలి. ఇందులో నీరు ఎక్కువగా నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి. బాటిళ్లను తరచూ మారుస్తూ ఉండాలి.



వివిధ రంగుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు

వాటితో అనేక సమస్యలు



ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులే ఎక్కువగా వివిధ రూపాల్లో ఉండే ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగిస్తుంటారు. అయితే వాటిని శుభ్రం చేయకపోవడంతో అడుగుభాగంలో ఉండే బ్యాక్టీరియా కడుపులోకి ప్రవేశిస్తుంది. క్రమంగా పిల్లలు టైఫాయిడ్, వాంతులు, విరేచనాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులను నివారించాలంటే స్టీలు, రాగి బాటిళ్లను వినియోగించాలి. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

– కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

ఆర్‌టీహెచ్ ప్రారంభోత్సవం వాయిదా

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీహెచ్) ప్రారంభోత్సవం వాయిదా పడింది. దీనిని సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించాల్సి ఉండగా వాయిదా పడిందని, తిరిగి ఎప్పుడు ప్రారంభించేదీ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

కాపు సామాజిక భవనం ఏర్పాటు చేయాలి

సీటీఆర్ఐ: ప్రతి జిల్లా కేంద్రంలో కాపు సామాజిక భవనాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేసినట్లు కాపునాడు ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘునరేష్ చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో కాపు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని తమ సంఘం తరఫున మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలకు విజ్ఞప్తి చేశామని, ఈ భవనానికి 30 సెంట్ల స్థలం కేటాయించే విషయంలో మంత్రి, ఎంపీ కీలకపాత్ర పోషించారని తెలిపారు. కాపునాడు నగర పార్లమెంట్ అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, రూరల్ అధ్యక్షుడు దేశినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడు కాళ్ల చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఎం, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల దీక్షా శిబిరం వద్దకు వెళ్లి సీపీఎం, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు నగర, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి, నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి న్యాయంగా ఇవ్వాల్సిన జీతం, ఇతర సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సీఐటీయూ నాయకులు పూర్ణిమరాజు, ఎస్.వెంకటేశ్వరావు, తాతరావు, రాజేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వడిశలేరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. సోమవారం రఘునాథపురంలో రేలంగి శివన్నారాయణ, దేవీలలిత, వర్షిత కుటుంబ సభ్యులను, కవలగొయ్యిలో తీగిరెడ్డి శివ, సాన్వి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు చందన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయి పరిశీలన



కాతేరు మలుపులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన ఆర్డీఓ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమల విద్యా సంస్థల సమీపంలో ప్రమాదాలు నివారించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని ఆర్డీఓ కె.కృష్ణనాయక్ తెలిపారు. నాలుగో వంతెన వద్ద ఉన్న ప్రమాద మలుపు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తన దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి సామాజిక బాధ్యతగా కొంతమంది తీసుకువచ్చారన్నారు. ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు స్వయంగా సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, హెచ్చరికలు, సూచికలు బోర్డులను ఏర్పాటు చేయించామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి పి.రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, దళిత సంఘాల నాయకులు

ప్రకాశంనగర్: తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, దళిత సంఘాలు సోమవారం స్థానిక గోకవరం బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ యువకులు గంజాయి తాగి తప్పు చేసి ఉంటే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లో తీసుకుని బహిరంగంగా కొట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, జంగం సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని, చట్టాన్ని అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, బి.పవన్, కె.రాంబాబు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణతో ఇసుక ర్యాంపు



సీతానగరంలో ఇసుక ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న అధికారులు

సీతానగరం: గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణనాయక్ తెలిపారు. సోమవారం సీతానగరం సచివాలయం వద్ద నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆర్డీఓతోపాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకర్, మైన్స్ ఏడీ ఫణి భూషన్‌రెడ్డి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సీతానగరం రెవెన్యూ పరిధిలోని లంక భూముల్లోని 4.81 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు జరుపుతారన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుక సీతానగరం ర్యాంపు నుంచి రవాణా చేస్తారన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి శంకర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు భారీ లోతుగా తవ్వుతున్నారని, ఎంత వరకు తవ్వొచ్చని అడిగారు. అదే విధంగా అధిక లోడుతో లారీలపై ఇసుక రవాణా చేస్తున్నారని అన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ కృష్ణ నాయక్ మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో మూడు మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపవచ్చన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక



కోరుబిల్లి దీపక్



గెద్దాడ చరణ్ శ్రీహర్ష

రంగంపేట: నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ కోసం పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. ఇందులో నలుగురు ప్రొవిజనల్‌కు ఎంపికకాగా ఫైనల్ సెలక్షన్‌లో గెద్దాడ చరణ్ శ్రీహర్ష, కోరుబిల్లి దీపక్‌లు ఎంపికయ్యారన్నారు. వీరికి 9, 10, 11, 12 తరగతుల్లో ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్లు బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందన్నారు. విద్యార్థులను, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం పార్థసారథి, విద్యా కమిటీ చైర్మన్ గెద్దాడ దుర్గారావు, ఉపాధ్యాయులు జాకబ్, చార్లెస్, సిబ్బంది అభినందించారు.

ఘనంగా స్వామివారి వార్షిక కల్యాణం



జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి 123వ వార్షిక కల్యాణం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో 15 మంది రుత్వికులు స్వామి కల్యాణ క్రతువులు కనుల పండవగా నిర్వహించారు. అలాగే సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయ వ్యవస్థాపకుడు కొవ్వూరి బసివిరెడ్డి 177వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొవ్వూరి బాలకృష్ణారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జి.మామిడాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా 'సబ్బెళ్ల'

పెదపూడి: జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్య జిల్లాలోనే ఉత్తమ సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తుందని లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని ప్రత్యూష పాఠశాల ఆవరణలో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణం స్వీకారం జరిగింది. దీనికి ప్రస్తుత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనువాస్ అధ్యక్షత వహించగా బాలకృష్ణ ముఖ్య అతిథిగా, ఇన్‌స్టాలేషన్ అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025-26కి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సబ్బెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా ద్వారంపూడి యువరాజారెడ్డి, కోశాధికారిగా డీఆర్‌కే రెడ్డి, మరో 20 మంది కార్యవర్గ సభ్యులతో బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా వినూత్న సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల అభిమానాన్ని లయన్స్ క్లబ్ పొందుతుందన్నారు. అనంతరం బాలకృష్ణను సన్మానించారు. క్లబ్ రీజియన్ ప్రతినిధి గంగాధర్, జోన్ ప్రతినిధి సురేష్, స్థానిక క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మండ రాజారెడ్డి, ప్రతినిధులు భాస్కరరెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒప్పుకొంటే తంటా!

- ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం
- నకిలీలుంటాయని అధికారుల హెచ్చరిక
- కొంటే రసీదు తీసుకోవాల్సిందే..



రంగంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

రంగంపేట: ఈ ఎరువులతో పంట దిగుబడి వస్తోంది.. ఏ ఏటా లేని లాభాలు ఆర్జించడం ఖాయం.. పంటలపై ఏ తెగులు వచ్చినా ఈ పురుగు మందు వాడండి.. ఇట్టే పంట తేరుకుంటుందని వ్యాపారులు చెప్పే మాటలను నమ్మి ఒప్పుకుంటే తప్పులో కాలేసినట్టే. నిషేధిత పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే నష్టపోవడం ఖాయమని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. అదేవిధంగా అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద వీటిని కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తారని, వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటోంది. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అనే విషయాలను తెలుసుకోవాలి. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో మొత్తం 45,500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. అనపర్తి మండలంలో 12 వేలు, రంగంపేట 2 వేలు, బిక్కవోలు 13 వేలు, పెదపూడి 18,500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. పంట పొలాలకు ఎరువుల వినియోగం అవసరం కానుంది. దీంతో మార్కెట్లలోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు జాగ్రత్తలు పాటించాలని వారు సూచిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు కొనాలని, లేదంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని అంటున్నారు. దుకాణదారులు లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టీ తయారు చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని, డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీల్ తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా.. నకిలీలపై సత్వరం రైతులు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం జరగడానికి అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నకిలీలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తరువాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

గోదావరిలో వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు: స్థానిక గౌతమఘాట్ వద్ద ఉన్న గోదావరి నదిలో గుర్తు తెలియని (63) వ్యక్తి మృతదేహం సోమవారం లభించింది. స్థానికుల సమాచారం మేరకు.. గోదావరి నదిలో మృతదేహం తేలియాడుతుందనే సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసి ఆధారాల కోసం గాలించగా ఏమీ లభించలేదు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిపుణుల సూచనలతో పోలవరం పనులు

ధవళేశ్వరం: అంతర్జాతీయ, సెంట్రల్ వాటర్ కమిషన్ నిపుణుల సూచనల మేరకే పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధవళేశ్వరంలోని కాటన్ గెస్ట్ హౌస్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు ప్రతిపక్షానికి లేదని అన్నారు. ప్రమాణాలకు అనుగుణంగా ఇప్పటి వరకూ 77 ప్యానెల్స్ వేశామన్నారు.